సాక్షి విశాఖపట్నం

సోమవారం, 6, మార్చి, 2023



మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం సైక్లోథాన్ (సైకిల్ ర్యాలీ) నిర్వహించారు. 8లో



అందరి చూపు.. ఆర్గానిక్ వైపు

ఏఎస్ రాజా మైదానంలో ఆదివారం నిర్వహించిన సహజ, సేంద్రీయ ఉత్పత్తుల ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభించింది. 8లో



ప్రతిభకు ఊతం 'వేదిక'

ఆర్కే బీచ్‌లో ఏర్పాటు చేసిన 'వైజాగ్ గాట్ టాలెంట్' లో నగర కళాకారులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి

సీతంపేట: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు సహాయ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి అన్నారు. స్వర్ణభారతి స్టేడియంలో జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ, పోలింగ్ తర్వాత మెటీరియల్ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చడం, కౌంటింగ్ ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. కౌంటింగ్ సమయంలో ఎన్నికల పరిశీలకులు, పోటీలో పాల్గొన్న అభ్యర్థులు, ఏజెంట్లకు కల్పించే సదుపాయాల గురించి అధికారులతో చర్చించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి పంపిణీ, కౌంటింగ్ సమయంలో సమాచారం ఏ విధంగా అందించాలి తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, సింహాచలం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, సూపరింటెండెంట్ రామారావు పాల్గొన్నారు.

ఏపీలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ భేష్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న తమిళనాడు హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ సెంథిల్

గాజువాక : రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ అద్భుతంగా ఉందని తమిళనాడు రాష్ట్ర హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ సెంథిల్ కుమార్ ప్రశంసించారు. విశాఖ పర్యటనకు విచ్చేసిన ఆయన గాజువాక పీహెచ్‌సీని ఆదివారం సందర్శించారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఫార్మసీ స్టోర్స్, ల్యాబ్ టెస్టులు, ఆప్తమాలజీ, ఇన్‌పేషెంట్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, వివిధ రిపోర్టుల తోపాటు రోగులకు అందిస్తున్న సేవలను ఆన్‌లైన్, యాప్‌లలో నమోదు చేస్తున్న విధానాన్ని ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. వైద్యులే రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం అందించే విధంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ బాగుందన్నారు. గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలను అభినందించారు. డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, అదనపు డీఎం అండ్ హెచ్‌వో పూర్ణేంద్రబాబు, మహిళా వైద్యాధికారి డాక్టర్ బి.ఉమావతి, గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ, సీహెచ్‌వో పి.నాగఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజిత్‌భార్గవ్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న రజిత్ భార్గవ్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజిత్‌భార్గవ్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ అప్పలనాయుడు అందజేశారు.

స్టాళ్ల ధ్వంసం కేసులో ఐదుగురిపై కేసు!

బీచ్‌రోడ్డు: నగరంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను ధ్వంసం చేసిన ఘటనలో ఐదుగురిపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. కిట్ల పంపిణీ, భోజనాల వద్ద కొంత మంది స్టాళ్లను ధ్వంసం చేయడంతో సదస్సుకు వచ్చిన ప్రతినిధులు ఇబ్బందులు పడ్డారు. ఈ ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టారు. సదస్సు ప్రాంగణంలో ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

మేరా వైజాగ్ మహాన్

- ప్రతి ఒక్కరి నోటా విశాఖ వైభవం
- పెట్టుబడుల సదస్సుతో విశాఖ నగరి కీర్తి విశ్వ వ్యాప్తం



సాక్షి, విశాఖపట్నం: సామాన్యుడి నుంచి వ్యాపార దిగ్గజం వరకు.. టిఫిన్ దుకాణం నుంచి స్టార్ హోటల్ వరకు.. రెస్టారెంట్ నుంచి రిసార్ట్ వరకు.. కార్మికుడి నుంచి.. ఐటీ ఉద్యోగి వరకు ప్రతీ ఒక్కరి నోటా విశాఖ వైభవం కీర్తినందుకుంటోంది. పరిపాలన రాజధానిగా అడుగులు వేస్తున్న తరుణంలో.. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ తర్వాత విశాఖ పేరు అంతర్జాతీయ స్థాయిలో మార్మోగుతోంది. పరిశ్రమలకు పట్టుగొమ్మగా.. ఉపాధి కల్పనకు ఆలంబనగా.. పెట్టుబడులకు స్వర్గధామంగా.. అంతర్జాతీయ నగరంగా భాసిల్లుతున్న నగరంలో ఇప్పుడు అందరి నోటా ఒకటే మాట.. మేరా వైజాగ్ మహాన్.

ప్రణాళికాబద్ధంగా నిర్మితమైన నగరంగా విశాఖకు పేరుంది. నవ్యాంధ్రలోని నగరాలతో పోలిస్తే.. విశాఖ విశాలమైన, ప్లాన్డ్ సిటీగా దేశ విదేశీ ప్రముఖులు సైతం కొనియాడారు. అందమైన నగరంలో నివసిస్తే అద్భుతమైన జీవితం సొంతమవుతుందని ఎందరో అభిప్రాయపడ్డారు. పడుతున్నారు. విశాఖలోనే జీవించాలని కోరుకునేవారు లక్షల్లో ఉన్నారనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. భిన్న వాతావరణం, విభిన్న సంస్కృతులు, మెచ్చే భాషలు, ఆది నుంచి దూసుకుపోతున్న రియల్ రంగం, అందుబాటులో మౌలిక వసతులు వెరసి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విశాఖపట్నం వైపు చూసేలా చేసింది గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్. ఇప్పటికే పలుమార్లు నివాసయోగ్యమైన నగరంగా.. వ్యాపారానికి అనువైన నగరాల్లో విశాఖపట్నం ఉందని పలు సర్వేలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో విశాఖ కీర్తి మరో మెట్టు పైకెక్కింది. నగరానికి ఎన్నడూ రాని దిగ్గజ పారిశ్రామిక వేత్తలు ఆగమనంతో సరికొత్త విశాఖ ఆవిష్కృతమైంది.

పెట్టుబడుల వెల్లువ

ఆహ్లాదకరమైన వాతావరణం.. సువిశాల సాగరతీరం.. అడుగడుగునా పర్యాటక సోయగంతో నగరం మెట్రో సిటీలను తలదన్నేలా రూపుదిద్దుకుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఐటీ హిల్స్ అభివృద్ధి చేయడంతో పాటు హైదరాబాద్‌తో సమానంగా విశాఖను అభివృద్ధి చేయాలని సంకల్పించి.. ఆ దిశగా చర్యలకు ఉపక్రమించారు. ఆయన మృతితో నగరాన్ని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. విభజన అనంతరం అభివృద్ధికి ఆస్కారం ఉన్నప్పటికీ టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విశాఖను విస్మరించింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విశాఖను పరిపాలన రాజధానిగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. దీన్ని కూడా రాజకీయం చేస్తూ.. వైజాగ్ అభివృద్ధికి టీడీపీ నేతలు కంటకులుగా మారారు. అయినప్పటికీ మొక్కవోని దీక్షతో మెట్రోసిటీగా వైజాగ్‌ను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది. రెండు రోజుల పాటు నిర్వహించిన సమ్మిట్‌లోనూ సీఎం వైఎస్ జగన్ త్వరలో విశాఖ పరిపాలన రాజధాని కాబోతోందని ప్రకటించడంతో.. ప్రజల ఆశలు, ఆకాంక్షలు మరోసారి విరాజిల్లాయి. ఈ సదస్సులో రాష్ట్రానికి ఊహించని రీతిలో పెట్టుబడులు వెల్లువెత్తగా.. ఇందులో విశాఖపట్నంను పారిశ్రామికవేత్తలంతా మొదటి ఆప్షన్‌గా ఎంచుకున్నారు. అందుకే ఏకంగా లక్షన్నర కోట్ల రూపాయలకు పైగా విశాఖకు పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఇదంతా ప్రాథమిక అంచనా. ఎంవోయూల మదింపు అనంతరం ఈ సంఖ్య రెండు లక్షల కోట్ల రూపాయలకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్ని రంగాల్లోనూ అపార అవకాశాలు ఉన్న ఏకైక నగరంగా విశాఖను పారిశ్రామికవేత్తలు ఎంపిక చేసుకోవడం శుభపరిణామం. ఈ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చితే.. లక్షలాది మంది ఉత్తరాంధ్రవాసులకు ప్రత్యక్షంగా, పరోక్షంగానూ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అంతేకాకుండా విశాఖ రూపురేఖలు మారిపోవడంతో పాటు టైర్-1 నగరాల జాబితాలో చేరే రోజు సమీపంలోనే ఉందని అంతా భావిస్తున్నారు. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్ దూరదృష్టి వల్లే సాధ్యమైందని ప్రతి ఒక్కరూ అభిప్రాయపడుతున్నారు.

నగరవాసులు ఫిదా

నగరంలో ఈనెల 28, 29 తేదీల్లో జీ-20 సదస్సు జరగనున్న నేపథ్యంలో బీచ్‌రోడ్డును సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గోడలపై జంతువులు, పువ్వులు, పక్షులు వంటి పెయింటింగ్స్ వేస్తున్నారు. తెన్నేటి పార్కు వద్ద రాళ్ల పైన వేస్తున్న సింహం, జింక వంటి బొమ్మలు అటుగా వెళ్తున్న సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. రైల్వేస్టేషన్ వద్ద గోడలపై జీ20 లోగో పెయింటింగ్ ఆకట్టుకుంటోంది.

– సాక్షి, ఫొటో గ్రాఫర్







సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

అల్లిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే న్యాయవాదుల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల న్యాయ విభాగం సర్వసభ్య సమావేశం ఆదివారం పార్టీ లీగల్ సెల్ కోర్ కమిటీ అధ్యక్షుడు జీఎం రెడ్డి అధ్యక్షతన సీతమ్మధారలోని క్షత్రియ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగుతోందని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. పట్టభద్రులుగా, సమాజంలో ఉన్నత స్థానం కలిగిన న్యాయవాదులుగా పది మందికి చెప్పి సీతంరాజు గెలుపులో కీలక పాత్ర వహించాలన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ సీతంరాజుకు అన్ని విధాల మద్దతు తెలపాలన్నారు. రాష్ట్ర న్యాయ విభాగం అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్లు కేటాయించారన్నారు. జూనియర్ న్యాయవాదులకు రూ.5వేలు స్టైఫండ్ అందజేస్తున్నారన్నారు. నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, శ్రీకాకుళం, విజయనగరం, రాజమండ్రి లీగల్ సెల్ అధ్యక్షులు ఉమాపతి, కె.నిరంజన్, సాధిక్ హుస్సేన్, లీగల్ సెల్ రాష్ట్ర ప్రతినిధి పాలూరి వెంకటరెడ్డి, స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, బ్రహ్మారెడ్డి, కృష్ణమోహన్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు వెలమ సంఘాల మద్దతు



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

మద్రిపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు వెలమసంఘాలు మద్దతు తెలిపాయి. బిర్లా జంక్షన్ దరి కేరళ కళాసమితి భవనంలో కార్పొరేటర్ అల్లు శంకరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు అధ్యక్షత వెలమ సంఘాల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా నేరుగా ముఖ్యమంత్రికి చెప్పుకునేలా రాష్ట్రంలో పాలన సాగుతుందని తెలిపారు. వెలమ సంఘానికి స్థలం కేటాయించాలని కొందరు అడిగారని, తప్పకుండా ఏర్పాటు చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అంతాకలిసి గెలిపించాలని కోరారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్క ల నాయుడుబాబు, మాజీ ఎమ్మెల్యేలు అల్లు భానుమతి, తైనాల విజయ్‌కుమార్, కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, ముర్రువాణి, పార్టీ నేత రొంగలి జగన్నాథం, వెలమసంఘం నాయకులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అనంతుని తెప్పోత్సవం



తెప్పోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు





పుష్కరిణిలో తెప్పపై ఊరేగుతున్న అనంత పద్మనాభ స్వామి

పద్మనాభం: అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. 50 ఏళ్ల తర్వాత ఈ ఉత్సవాన్ని నిర్వహించడంతో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కుంతీ మాధవస్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను రాత్రి 8 గంటలకు పద్మనాభం జంక్షన్‌కు సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఉత్సవ విగ్రహాలను హంస వాహనంలో అధిష్టింపజేశారు. తెప్పోత్సవాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నెల్లిమర్ల శ్రీదుర్గ మహా పీఠం ఉత్తర పీఠాధిపతి శ్రవణానంద చైతన్య చినస్వామి ప్రారంభించారు. స్థానిక జాలర్లు తాళ్లతో లాగగా హంస వాహనం పుష్కరిణిలో ముందుకు సాగింది. పద్మనాభుని నామస్మరణాల మధ్య తెప్పోత్సవం ఉత్సాహంగా సాగింది. పరిసర ప్రాంత గ్రామాల నుంచే కాకుండా సింహాచలం, విజయనగరం, తగరపువలస నుంచి వచ్చిన భక్తులతో అనంతుని పుష్కరిణి జన సంద్రంగా మారింది. ఈ సందర్భంగా కోలాటం, శక్తి డ్యాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, ఈవో ఎస్.నానాజీ బాబు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వరం

- ప్రైవేట్ స్కూళ్లలో 25% సీట్లు
- నేటి నుంచి పాఠశాలలు రిజిస్ట్రేషన్
- సీఎస్‌సీ వెబ్‌సైట్‌లో సమగ్ర వివరాలు
- 18 నుంచి దరఖాస్తుకు అవకాశం
- లాటరీ పద్ధతిలో సీట్ల కేటాయింపు
- అమ్మ ఒడి పథకం కింద ఫీజు చెల్లింపు



విశాఖ విద్య: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉచితంగానే చదువుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. నచ్చిన పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశం పొందవచ్చు. సీటు పొందిన విద్యార్థుల ఫీజును అమ్మ ఒడి పథకం కింద ప్రభుత్వం చెల్లించనుంది. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. సోమవారం నుంచి జిల్లాలో గుర్తింపు ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల నిర్వాహకులు సీఎస్‌సీ వెబ్‌సైట్‌లో తమ వివరాలను అందుబాటులో ఉంచాలి.

ప్రవేశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు http://cse.ap.gov.in/ అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు. 2022–23లో జిల్లాలో 114 మంది ఈ పథకం ద్వారా లబ్ధిపొందారు. ఈ ఏడాది మరింత ఎక్కువ మంది విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు దృష్టి సారించారు.

ఇదీ షెడ్యూల్

- సోమవారం నుంచి ఈ నెల 16 వరకు గుర్తింపు ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల నిర్వాహకులు వెబ్‌సైట్‌లో వివరాలను అందుబాటులో ఉంచాలి.
- ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 7 వరకు దరఖాస్తు చేసుకోవాలి
- ఏప్రిల్ 9 నుంచి 12 వరకు అర్హులైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తారు.
- ఏప్రిల్ 13న మొదటి రౌండ్ జాబితాను లాటరీ పద్ధతిన ప్రకటిస్తారు.
- ఏప్రిల్ 15 నుంచి 21 వరకు సీటు పొందిన విద్యార్థులు పాఠశాలల్లో చేరాలి.
- ఏప్రిల్ 25న రెండో విడత సీటు పొందిన వారి వివరాలు ప్రకటిస్తారు.
- ఏప్రిల్ 26 నుంచి 30 వరకు విద్యార్థులు పాఠశాలల్లో చేరేందుకు అవకాశం ఉంది.

తల్లిదండ్రులకు అండగా టోల్ ఫ్రీ నంబర్

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో అర్హులైన పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉచిత సీట్లు పొందే విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే, సకాలంలో పరిష్కరించేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం 14417 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచింది. విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. వచ్చిన గ్రీవెన్స్‌లను సత్వర పరిష్కారం కోసం ఎంఈవో, డీఈవో స్థాయిలో ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేస్తున్నారు.

సీట్ల కేటాయింపు ఇలా..

ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు అన్నింటిలో 2023–24 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో తప్పనిసరిగా 25 సీట్లు పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు కేటాయించాలి. ఇందులో అనాథలు, దివ్యాంగులు, హెచ్ఐవీ బాధిత పిల్లలకు 5 శాతం, ఎస్సీ–10 శాతం, ఎస్టీ–4 శాతం, ఇతర వర్గాలకు –6 శాతం సీట్లు కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు, అర్బన్‌లో అయితే రూ.1.44 లక్షలు మించకుండా ఉన్న వారే అర్హులు.

ఫీజు చెల్లింపు ఇలా..

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో సీటు పొందిన విద్యార్థులు ఏడాదికి ఎంత ఫీజు చెల్లించాలనేది ప్రభుత్వం ముందుగానే నిర్ణయించింది. అర్బన్‌లో రూ.8 వేలు, రూరల్‌లో రూ.6,500లు, గిరిజన/షెడ్యూల్ ప్రాంతాల్లో రూ.5.100. వీటిని అమ్మ ఒడి పథకం కింద విద్యార్థులు ప్రవేశం పొందిన పాఠశాలలకు ప్రభుత్వం చెల్లించనుంది.

సద్వినియోగం చేసుకోవాలి



పేద విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లలో చదువుకోవాలనే కోరిక ఈ కార్యక్రమం ద్వారా నెరవేరుతుంది. ఈ సారి ఎక్కువ మందికి లబ్ధిచేకూర్చేలా దృష్టిసారించాం. దీనిపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎల్. చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

25 శాతం సీట్లు ఇవ్వాల్సిందే..



పేద విద్యార్థులకు ఇదో వరం అనే చెప్పాలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంచి ఆలోచనతో దీన్ని అమలకు సిద్ధమయ్యారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలి. విద్యాశాఖాధికారులు కూడా దీన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే కమిషన్ దృష్టికి తీసుకురావచ్చు.

– డాక్టర్ సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు

మహిళా సాంస్కృతిక నాట్య వైభవం



మౌనిషా దేవి (అసోం), కిరణ్మయి(తెలంగాణ), రూపాకిరణ్(హాంకాంగ్) నృత్యాభినయం

మద్దిలపాలెం: ఖండాంతరాలకు చెందిన మహిళలు మన సంప్రదాయ నృత్యాలను అవలీలగా ప్రదర్శించి అబ్బురపరిచారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా కల్చరల్ అండ్ ఆర్ట్స్ ప్రమోషన్ సొసైటీ(క్యాప్స్)ను రైల్వే న్యూకాలనీలోని ఓ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేశారు. సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన తొలి ప్రదర్శనను రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి. రమణమూర్తి, విజయనిర్మాణ్ అధినేత డాక్టర్ సూరపనేని విజయకుమార్, క్యాప్స్ సంస్థ అధ్యక్షురాలు ఎస్.విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి నర్తకి డాక్టర్ కిరణ్మయి బోనాల, కర్ణాటకకు చెందిన భరతనాట్య కళాకారిణి ఉమామహేశ్వరి, అసోంకు చెందిన సత్రియ నాట్యకారిణి డాక్టర్ మోనీషాదేవి గోస్వామి, హాంగ్‌కాంగ్‌కు చెందిన రూపాకిరణ్ భరతనాట్యంతో ఆకట్టుకున్నారు.

14 మందికి పురస్కారాలు : రాష్ట్రంలో నాట్యం, సంగీతంలో రాణిస్తున్న 14 మందిని శక్తి మహిళా పురస్కారాలతో క్యాప్స్ ప్రతినిధులు సత్కరించారు. తెలంగాణకు చెందిన రంగమణి ఓలేటి, భరతి మండాలతో పాటు విశాఖకు చెందిన సంతోషి విజయ, ఆదిత్యశ్రీ, అరుణా పరమేష్, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌కు చెందిన రేష్మి పథియాత్ ఈ పురస్కారాలు అందుకున్నారు. ప్రముఖ నాట్య గురువు బత్తిన విక్రమ్‌గౌడ్ పర్యవేక్షణలో ఈ వేడుకగా సాగింది.

క్లుప్తంగా

నేడు జీవీఎంసీ స్పందన

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ పి.రాజాబాబు కోరారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం(బాలికలు)లో ఈ నెల 10వ తేదీ నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు 10వ తరగతి, సుయింగ్ మిషన్ ఆపరేటర్ కోర్సుకు 5వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న 45 ఏళ్ల లోపు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 94405 96054, 99493 85184లో సంప్రదించవచ్చు.

నూకాంబికకు వెండి కిరీటం



అమ్మవారికి వెండి కిరీటం అలంకరిస్తున్న భక్తులు

ఎస్.రాయవరం: కొరుప్రోలులో నూకాంబిక అమ్మవారికి 2.7 కిలోల వెండి కిరీటాన్ని ఆదివారం గ్రామానికి చెందిన ఇందుకూరి బంగారమ్మ కుటుంబ సభ్యులు అందజేశారు. దీని విలువ రూ.2.46 లక్షలని దేవదాయశాఖ ఈవో మురళీకృష్ణ తెలిపారు. ఆ కిరీటాన్ని గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు సమక్షంలో అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొరపాటి గోపాలం,గ్రామ పెద్దలు కొంగర రాజు,కొంగర రాజు, ప్రత్తిపాటి సత్యనారాయణ, బత్తిన కన్నారావు,మాజీ ఎంపీటీసీ చేకూరి వరహాలరాజు పాల్గొన్నారు.

ప్రతిభకు ఊతం 'వేదిక'

- 'వైజాగ్ గాట్ టాలెంట్' కార్యక్రమానికి అపురూప స్పందన
- ఆకట్టుకున్న నగరవాసుల నృత్యాలు, సంగీతం



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కమిషనర్ రాజాబాబు, సీపీ శ్రీకాంత్. చిత్రంలో జేసీ విశ్వనాథ్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. దానిని నిరూపించుకునేందుకు 'వేదిక' అవసరమని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అన్నారు. ఆర్కే బీచ్ కాళీమాత గుడి వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన 'వైజాగ్ గాట్ టాలెంట్' కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ విశ్వనాథ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ విశాఖ వాసుల్లో దాగిన ప్రతిభను వెలికి తీయడమే వేదిక ముఖ్య ఉద్దేశమన్నారు. పోలీస్ కమిషనర్ ఆలోచన మేరకు జీవీఎంసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమ నిర్వహణ చేపట్టినట్లు తెలిపారు. ఇది పూర్తిగా ఉచితమని.. ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలు తమ టాలెంట్లను నిరూపించుకోవచ్చన్నారు. ఇందుకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అందుబాటు తేదీల వారీగా ఔత్సాహికులు తమ ప్రతిభను ప్రదర్శించవచ్చన్నారు. ప్రస్తుతం 386 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 13 గ్రూపులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయని కమిషనర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మంచి ఆలోచనతో వేదిక ఏర్పాటు చేసినందుకు జీవీఎంసీ కమిషనర్‌ను అభినందించారు. ఆర్కే బీచ్‌కు ఎంతో మంది సందర్శకులు వస్తారని, ఇటువంటి వేదిక ద్వారా వారికి ఆహ్లాదం కల్పించడంతో పాటు నగర ప్రజల్లోని ప్రతిభను నలుగురికీ పరిచయం చేయవచ్చన్నారు. సరైన వేదిక లేక ఎంతో మంది తమలో ప్రతిభ ఉన్నా నిరూపించుకోలేక పోతున్నారని అన్నారు. అటువంటి వారికి జీవీఎంసీ కమిషనర్ ఏర్పాటు చేసిన ఈ వేదిక ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీనిని నగరవాసులు ఉపయోగించుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ తల్లిదండ్రులందరూ తమ పిల్లల్లో దాగిన ప్రతిభను ఈ వేదిక ద్వారా వెలికి తీయాలన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

మొదటి రోజు 30 మంది వివిధ ప్రదర్శనల ద్వారా తమలో దాగి ఉన్న ప్రతిభను ప్రదర్శించి వీక్షకుల ప్రశంసలు అందుకున్నారు. కూచిపూడి, రాకింగ్ సాంగ్స్, డిస్కో డ్యాన్స్‌లతో ఆహూతులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఎస్టేట్ ఆఫీసర్ ఆనంద్, ఏఎంహెచ్‌వోలు డాక్టర్ కిశోర్, డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.



ప్రత్యేక ఆకర్షణగా దివ్యాంగుల ప్రదర్శన



హాజరైన నగర ప్రజలు

పలు స్టేషన్లలో డీఆర్‌ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి ఆదివారం విశాఖపట్నం- నౌపడ-గుణుపూర్ సెక్షన్‌లలో విండో ట్రయిలింగ్ తనిఖీలు నిర్వహించారు. సింహాచలం, కొత్తవలస, చీపురుపల్లి, శ్రీకాకుళం, నౌపడ, పర్లాకిమిడి, గుణుపూర్ స్టేషన్లలో పర్యటించి, అక్కడ పరిస్థితులను, వనరులను పరిశీలించారు. ఇటీవల భారతీయ రైల్వేలో అమృత్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ స్కీం కింద వాల్తేర్ డివిజన్ పరిధిలో మొదటిదశలో 16 స్టేషన్లను ఆధునికీకరణ చేపట్టనున్నారు. వీటిలో దువ్వాడ, విజయనగరం, సింహాచలం, కొత్తవలస, చీపురుపల్లి, శ్రీకాకుళం, నౌపడ, అరకు, కోరాపుట్, జగదల్‌పూర్, దమన్‌జోడి, జయ్‌పూర్, బొబ్బిలి, పార్వతీపురం, పర్లాకిమిడి, గుణుపూర్ స్టేషన్లు ఉన్నాయి. ఈ సందర్భంగా డీఆర్‌ఎం ప్రజల నుంచి పలు వినతులను స్వీకరించారు. కొత్త రైళ్లు, అదనపు హాల్ట్‌ల గురించి ఆయా స్టేషన్‌లో ప్రయాణికులు డీఆర్‌ఎం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ పర్యటనలో ఏడీఆర్‌ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ (గతిశక్తి) టి.ఎం. రావు, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ పి.కె. మహరాణా పాల్గొన్నారు.



సింహాచలం రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) కార్యాలయం నుంచి ఆదివారం సైక్లోథాన్ (సైకిల్ ర్యాలీ) నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో ఆయనతో పాటు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, మహిళలు పాల్గొని సత్యం కూడలి వరకు ర్యాలీగా తరలి వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. అక్కడ మహిళల ప్రాధాన్యం గురించి వివరించి, వారి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ఆధిక్యం కనబరచాలన్నారు. ఎనీమియాకు గురి కాకుండా హెచ్‌బీ శాతం పెంచుకోవాలని, తగిన పాళ్లలో ఆహారం తీసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. భేటీ పడావో- భేటీ బచావో నినాదంతో ముందుకు పయనించాలన్నారు. క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి రక్షించుకోవచ్చునని అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, ప్రపంచ హెల్త్ సంస్థకు చెందిన వైద్యురాలు డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, రవిశంకర్, బి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు గెలుపుతోనే సమస్యలకు పరిష్కారం

వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చౌక్కాకుల

విశాఖ విద్య: సీతంరాజు సుధాకర్ గెలుపుతో ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభించనుందని వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ అన్నారు. ఆదివారం విశాఖ వచ్చిన ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకటరామిరెడ్డిని కలిసి పలు సమస్యలపై చర్చించారు. వివిధ డీఎస్సీల ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలు అందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఉపాధ్యాయుల సర్వీసు పరమైన సమస్యలను సకాలంలో పరిష్కరించటంలో ఏపీజీఈఎఫ్ కృషి ఎనలేనిదన్నారు. ప్రభుత్వంపై ఉపాధ్యాయ, ఉద్యోగులంతా సానుకూలతతోనే ఉన్నారన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకోవటం ద్వారా ఈ ప్రాంత పట్టభద్రులు, ఉద్యోగులు ప్రభుత్వం వెంట ఉన్నారనే సంకేతాన్ని పంపించాలన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు కమ్మిడి సుబ్బారావు, నాయకులు లక్ష్మణరావు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వైభవ్ విశేష జ్యూయలరీ ప్రదర్శనకు స్పందన



జ్యోతి ప్రజ్వలనతో ప్రదర్శనను ప్రారంభిస్తున్న గ్రంధి మల్లికా మనోజ్

బీచ్‌రోడ్డు: వైభవ్ జ్యూయలరీ ఏర్పాటు చేసిన విశేష ఉబర్ ఎక్స్‌క్లూజివ్ జ్యూయలరీ ప్రదర్శనకు నగరవాసుల నుంచి స్పందన లభిస్తోంది. సాగరతీరంలోని వెల్‌కమ్ హోటల్ గ్రాండ్ బేలో ఆదివారం ఈ ప్రదర్శనను వైభవ్ ఛైర్‌పర్సన్ గ్రంధి మల్లికా మనోజ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో ఇన్‌స్పైర్డ్, హ్యాండ్ క్రాఫ్టెడ్, క్యూరేటర్ డిజైన్‌కు సంబంధించి నాలుగు సరికొత్త కలెక్షన్లు స్టార్‌డస్ట్, మిరాజ్, రెస్ప్లెడెంట్, అవతారా డిజైనర్ డైమండ్ జ్యూయలరీని అందుబాటులో ఉంచామన్నారు. ఇలాంటి విశిష్టమైన ప్రదర్శన వివాహ, పండగ సమయాల్లో ప్రదర్శించడం ఎంతో ప్రత్యేకమన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ కీర్తన తదితరులు పాల్గొన్నారు.

రేపే అప్పన్నకు పెళ్లిచూపులు

కొండ దిగువ ఉద్యానవన మండపంలో డోలోత్సవం

సింహాచలం: ఫాల్గుణ పౌర్ణమి పురస్కరించుకుని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి మంగళవారం పెళ్లి చూపులు జరగనున్నాయి. స్వామి పెళ్లి కుమారుడిగా ముస్తాబై.. సింహగిరి నుంచి కొండ దిగువకు విచ్చేయనున్నారు. అక్కడ పుష్కరిణి సత్రంలోని ఉద్యానవన మండపంలో అధిష్టించి డోలోత్సవం నిర్వహించుకుంటారు. పెళ్లి నిశ్చయం అయిన ఆనందంతో అడవివరంలో తిరువీధి జరుపుకోనున్నారు.

ఉత్సవం నిర్వహణ ఇలా...


శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకీలో ఉంచి మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో సింహగిరి నుంచి కొండ దిగువకు మెట్లమార్గం ద్వారా తీసుకొస్తారు. అక్కడి నుంచి అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయానికి తిరువీధిగా తీసుకెళ్తారు. తదుపరి పుష్కరిణి సత్రంలోని ఉద్యానవన మండపానికి తీసుకెళ్లి స్వామిని డోలీలో అధిష్ఠింపజేస్తారు. వసంతోత్సవం, చూర్ణోత్సవం, డోలోత్సవం నిర్వహిస్తారు. అనంతరం అడవివరంలో తిరువీధి ఉత్సవం జరుగుతుంది. మరలా పైడితల్లి ఆలయం వద్దకు స్వామిని తీసుకెళ్లి అక్కడి నుంచి తిరిగి మెట్లమార్గంలో కొండపైకి చేర్చుతారు. డోలోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో వైదికులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉద్యానవన మండపాన్ని విశేషంగా ముస్తాబు చేస్తున్నారు.

డోలోత్సవం వెనుక కథ ఇదీ..

డోలోత్సవం నిర్వహణ వెనుక అనాదిగా ఓ కథ ప్రచారంలో ఉంది. సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఏటా చైత్ర శుద్ధ ఏకాదశి రోజున ఎంతో వైభవంగా వార్షిక కల్యాణోత్సవం నిర్వహిస్తారు. చైత్ర శుద్ధ ఏకాదశికి ముందు వచ్చే ఫాల్గుణ పౌర్ణమి రోజున స్వామికి పెళ్లి చూపుల సంప్రదాయంతో డోలోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అడవివరం గ్రామ సంప్రదాయం ప్రకారం దీనిని బొట్టినడిగే పున్నమిగా పిలుస్తారు. అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారిని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సోదరిగా అభివర్ణిస్తారు. పైడితల్లి అమ్మవారి కుమార్తెనే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి పెళ్లి చేసుకున్నారని విశ్వసిస్తారు. అందుకే ఏటా ఫాల్గుణ పౌర్ణమి రోజున తనకు పిల్లనివ్వమని సింహగిరి నుంచి కొండదిగువకు స్వామి వస్తారని, పెళ్లి కుదిరిన ఆనందంలో డోలోత్సవం నిర్వహించుకుంటారని గ్రామస్తులు భావిస్తారు. ఈ క్రమంలోనే సింహగిరిపై నుంచి కొండ దిగువకు వచ్చిన స్వామి తొలుత తన సోదరి అయిన పైడితల్లి ఆలయం వద్దకు వెళ్లి తనకు పిల్లనివ్వమని అడుగుతారు. 'నీకు ఆస్తిపాస్తులు ఏం ఉన్నాయని.. ఏం చూసి పిల్లనివ్వాలని' తొలుత పైడితల్లి ఒప్పుకోదు. దీంతో స్వామి అలిగి అక్కడి నుంచి వెళ్లిపోయి పుష్కరిణి సత్రంలోని ఉద్యానవనమండపంలో అధిష్టిస్తాడు. అక్కడ ఎంతో వైభవంగా డోలోత్సవం, వసంతోత్సవం, చూర్ణోత్సవం జరుపుకుంటారు. ఈ వేడుక విషయాన్ని తెలుసుకున్న పైడితల్లి అమ్మవారు స్వామికి ఎంతో మంది భక్తులు ఉన్నారని, వారే ఆయన ఆస్తి అని తెలుసుకుని పిల్లనివ్వడానికి ఒప్పుకుంటుంది. పిల్లనిస్తానని స్వామిని ఆహ్వానిస్తుంది. స్వామికి పెళ్లి నిశ్చయమైన ఆనందంతో గ్రామస్తులు, భక్తులు, దేవస్థానం ఉద్యోగులు, వైదికులు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని వసంతోత్సవం జరుపుకుంటారు. ఈ కార్యక్రమాన్నే డోలోత్సవంగా అభివర్ణిస్తారు. డోలోత్సవం అనంతరం ఉగాది రోజున పెళ్లిరాట, చైత్రశుద్ధ ఏకాదశి రోజున వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.



అప్పన్న ఉత్సవమూర్తులు



అడవివరం గ్రామ దేవత, స్వామి సోదరి పైడితల్లి అమ్మవారు



డోలోత్సవం జరిగే కొండ దిగువ ఉద్యానవన మండపం

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.56,550
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.51,850
వెండి(కిలో):	రూ.70,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.117
స్కిన్	: రూ.204
స్కిన్‌లెస్	: రూ.214

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	420.00
విజయనగరం	424.00
శ్రీకాకుళం	424.00

నేటి నుంచి ఉన్నత విద్యామండలి క్విజ్ పోటీలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం- ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో సోమ, మంగళ వారాల్లో రీజినల్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సమన్వయకర్త ఆచార్య ఎ.రామ నాగ హనుమాన్ తెలిపారు. ఏయూ టి.ఎల్.ఎన్ సభా మందిరంలో ఉత్తరాంధ్రతో పాటు గోదావరి జిల్లాలకు చెందిన కళాశాలల విద్యార్థులు 40 బృందాలుగా ఈ క్విజ్ పోటీల్లో పాల్గొంటున్నారు. విజేతలైన నాలుగు బృందాలను ఈ నెల 18న జరిగే సెమీఫైనల్ పోటీలకు పంపిస్తారు.

అందరి చూపు.. ఆర్గానిక్ వైపు.!

ఆకట్టుకున్న సహజ, సేంద్రీయ ఉత్పత్తుల ప్రదర్శన

ఎంవీపీకాలనీ: నేచురల్ లివింగ్ ఎక్స్‌పో పేరిట ఎంవీపీకాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో ఆదివారం నిర్వహించిన సహజ, సేంద్రీయ ఉత్పత్తుల ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభించింది. మహిళా దినోత్సవం పురస్కరించుకుని విశాఖ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వుమెన్ వింగ్ ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది. సేంద్రీయ ఉత్పత్తుల స్టాళ్లు, ఆరోగ్యకరమైన బేక్స్, చెక్క ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు, సేంద్రీయ వంటకాలు, మిల్లెట్ స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. వీసీసీఐ అధ్యక్షుడు ఆర్.సతీష్, గౌరవ కార్యదర్శి రోలాండ్ విలియమ్స్, వీసీసీఐ మహిళా విభాగం అధ్యక్షురాలు జీజా వల్సరాజ్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఉత్పత్తులను తిలకిస్తున్న సందర్శకులు







ఉపమాక వెంకన్నకు నీరాజనం

- దర్శనానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు



అద్దాలమహల్‌లో దర్శనమిస్తున్న స్వామివారు



స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు

నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కల్యాణోత్సవాల అనంతరం మూడోరోజు ఆదివారం స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యార్చనలు అభిషేకాలు నిర్వహించారు. బాల భోగనివేదన రాజభోగనివేదన, అష్టదిక్పాలకులకు ఆవాహన,నాలాయిర సేవాకాలం, చిన్నపల్లకీలో తిరువీధి సేవలు తీర్థగోష్ఠి ప్రసాద వినియోగం నిర్వహించారు. స్వర్ణాభరణాలతో అలంకరించిన స్వామివారిని అద్దాలమహల్‌లో ఉంచారు. కల్యాణశోభతో కాంతులీనుతున్న మలయప్పస్వామిని భక్తులు దర్శించుకున్నారు. ప్రధాన రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా స్వామి దర్శనానికి వెళ్లారు. కొండపై మూలవిరాట్‌ను, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామిని, స్వామివారి ఉత్సవమూర్తులను దర్శించుకుని ఉపమాకలో జరుగుతున్న తిరునాళ్లను తిలకించి తిరుగు ప్రయాణమయ్యారు. ఉపమాక,వేంపాడు జానకయ్యపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు, మహిళలు కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టీటీడీ, హిందూధర్మప్రచార పరిషత్ ఏర్పాటు చేసిన అన్నమాచార్య కీర్తనల ఆలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కల్యాణానికి రాలేని భక్తులు సెలవుదినాల్లోను, పౌర్ణమినాడు స్వామివారిని దర్శించుకుంటారు. కాకినాడ జిల్లా దుగ్గాడకు చెందిన శంకర్ అనే భక్తుడు సుమారు 5 వేల మందికి స్థానికుల సాయంతో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు.

వెంకన్నను దర్శించుకున్న డీఈవో : జిల్లా విద్యాశాఖాధికారి మహాలక్ష్మమ్మ ఆదివారం ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు. అర్చకులు ఆమె గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సందడి చేసిన సాధువు : ఉపమాక వెంకన్న ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఓ సాధువు సందడి చేశారు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఆ సాధువు శరీరమంతా విభూతి రాసుకుని, మెడలో రుద్రాక్ష మాలలు ధరించి ఆలయాని వచ్చి, కొంతసేపు శంఖం ఊదడంతో అక్కడకు వచ్చిన వారంతా వింతగా చూశారు. సాధువు వద్ద ఆండ్రాయిడ్ ఫోన్, ఇయర్‌ఫోన్స్ కూడా ఉండటం విశేషం.